# ప్రమోషన్



డైరెక్టర్‌గారు ఆఫీసునుంచి ఇన్‌స్పెక్షన్‌కి వచ్చారు.

పోస్ట్‌మాస్టర్ జోగినాథం ఉత్సాహంగా రికార్డులన్నీ చూపిస్తున్నాడు. అయ్యగారు 'ఖుష్' అయితే ప్రమోషన్ ఖాయం.

"రిటర్న్స్, స్టేట్‌మెంట్స్ అన్నీ డ్యూడేట్‌కి పోతున్నాయా?" అని అడిగాడు ఆఫీసర్ రికార్డులు చూస్తూ.

"పోతున్నాయండీ... ఇదుగో-చూడండి. కేలండర్ ఆఫ్ రిటర్న్స్!"

– అంటూ పుస్తకం తెరిచి వివరాలు చూపించసాగాడు జోగినాధం.

"గుడ్... మీ స్టాఫ్ బాగా పని చేస్తున్నారన్నమాట!"

"అదేం లేదండీ. ఆఫీసులో ఎవరూ పని చేయరండీ!"

"మరి..?"

"అన్నీ నేనే చేస్తుంటానండీ!"

"అదేమిటి? వాళ్ళు చెయ్యాలి కాని, మీరు చేయడమేమిటి?"

"ఏం చేస్తానండీ... చెప్పినా వినరండీ. అందుకే నేను చేయక తప్పడం లేదండీ!"

"మీ పని మీకు సరిపోతుంది. ఇవన్నీ చెయ్యడానికి ఇంక టైం ఎక్కడుంది?"

"నా క్వార్టర్స్ కాంపౌండ్‌లోనే ఉంది కదాండి.., రాత్రుళ్ళు భోజనం చేసొచ్చి కూర్చుంటానండీ. ఆదివారాలు, సెలవులు కూడా ఎక్కడికీ పోకుండా ఆఫీసు పనే చేస్తుంటానండీ!" అంటూ నెలల తరబడి తను చేసిన ఇతరుల పనిని వివరంగా చూపించాడు జోగినాధం.

"బాగుంది... ఆఫీసు గోడలూ, అవీ శుభ్రంగా ఉన్నాయి. కనీసం స్వీపర్లైనా ఒళ్ళు వంచి పనిచేస్తారన్నమాట!"

"లేదండీ! రోజూ నేలనే సరిగ్గా తుడవరు. నెలకోసారి ఓ ఆదివారం నేనూ, మావాళ్ళూ కలిసి బూజు దులిపి శుభ్రంగా కడిగివేస్తామండీ... స్వీపర్లెవరూ వినే రకాలు కాదండీ!"

"చాలా ఇంటరెస్టింగ్‌గా ఉంది. ఎన్నాళ్లబట్టీ ఈ ఆఫీసులో పనిచేస్తున్నారు?"

"ఆర్నెల్లు అవుతోందండీ! ఇంతకుముందు పోస్ట్‌మాస్టర్ రిటైరయితే ఆ వేకెన్సీలో అఫీషియేట్ చేస్తున్నాను. నేను చాలా సీనియర్‌నండీ! తమరు అనుగ్రహిస్తే ఈసారి సెలక్షన్లో నా పేరు ఉంటుందండీ!" అంటూ చేతులు కట్టుకుని వినయంగా చెప్పాడు జోగినాధం.

"సరే... చూస్తాను" అని మిగిలిన ఇన్‌స్పెక్షన్ పూర్తిచేసుకుని వెళ్లిపోయారు డైరెక్టర్‌గారు.

అయ్యగారు 'చూస్తాను' అంటే... దాని అర్థం-'చేస్తాను' అనే అనుకుని ఆనందంతో ఎగిరి గంతేసినంత పనిచేశాడు జోగినాధం.

మరుసటి నెలలో డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ మీటయింది.

ఆ విషయం తెలిసినప్పటినుంచి తనకు వచ్చే ఆర్డరు కోసం ఎదురుచూడసాగాడు జోగినాధం ప్రతిరోజూ.

*　　*　　*

ఆరోజు సర్వీసు కవరు జోగినాథం పేరిట వచ్చింది.

'ప్రమోషన్ ఆర్డర్స్ వచ్చాయన్న ఆనందంతో ఆతృతగా దానిని తెరిచిచూశాడు జోగినాథం. అందులోని విషయం చదివి అతని నోరు తెరిచినది తెరిచినట్లే ఉండిపోయింది.

అందులో... "ఆఫీస్ హెడ్ అనేవాడు తన క్రిందవారి చేత సక్రమంగా పనిచేయించ గలగాలి. అంతేకాని.., అన్నీ తానే చేస్కోకూడదు. అలాగయితే వేరే స్కేల్‌లో ఎక్కువ జీతం యిచ్చి ఆఫీసు హెడ్‌ను నియమించాల్సిన అవసరం లేదు. అందుకు ఒకరిద్దరు మామూలు గుమాస్తాలు సరిపోతారు. జోగినాథంగారు గుమాస్తా పనులనూ, ఆఖరికి స్వీపరు పనులనూ కూడా స్వయంగా చేస్తూ వచ్చారు. దానివల్ల వ్యక్తిగతంగా ఆయన ప్రతిష్ఠే కాక, ఆఫీస్ హెడ్ పదవి హోదాకి భంగం కలిగింది. ఆఫీసు స్టాఫ్ దృష్టిలోనూ, బయటివారి దృష్టిలోనూ కూడా ఆయన చులకన అయ్యారు. ఆఫీసును నవ్వులపాలు చేశారు. ఏ గుమస్తాకైనా పని ఎక్కువగా ఉంటే తాను సహాయం చేయడంలో తప్పులేదు. కాని వాళ్ళ పని తాను చేయడం ఆయన అసమర్ధతని చాటుతోంది. ఆయనకి తన క్రింది స్టాఫ్‌ని కంట్రోలు చేసే శక్తీ, నేర్పూ లేవని స్పష్టమయింది. అందువల్ల ఆయన 'హెడ్ ఆఫ్ ది ఆఫీస్' గా ఉండడానికి అర్హుడు కాదు. ఈ కారణంగా ఆయనకి పోస్టుమాస్టర్ ప్రమోషన్ ఇయ్యకపోగా, ప్రస్తుతం ఉన్న ఆఫీసు మెయింటనింగ్ కెపాసిటీ నుంచి కూడా తప్పించి ఒరిజినల్ పోస్టు అయిన గుమాస్తాగా రివర్ట్ చేయడమైనది" అని ఉంది.

పాపం... అది చూస్తూనే కుప్పకూలిపోయాడు జోగినాథం.

– పల్లకి వార పత్రిక... *2 జూన్ '93*



**<u>డైరెక్టర్</u>**

డైరెక్టర్ : హీరోగారూ... ఇప్పుడు మీరు నీళ్లలోకి దూకాలి.

హీరో : ఈ నీళ్లలో నేను దూకను. వాటి లోతు రెండడుగులు కూడా లేదు.

డైరెకర్ : అందుకే దూకమంటోంది. లోతు ఎక్కువై మీరు మునిగారంటే మేమూ మునిగిపోతాం.